గ్రేట్ గ్రేస్

- దంచికొట్టిన గ్రేస్ హ్యారిస్
- గుజరాత్‌పై యూపీ గెలుపు
- డబ్ల్యూపీఎల్ రెండో సీజన్

గ్రేస్ హ్యారిస్ (60*)

బెంగళూరు: గ్రేస్ హ్యారిస్ (33 బంతుల్లో 60 నాటౌట్; 9 ఫోర్లు, 2 సిక్సర్లు) దంచికొట్టడంతో మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్‌లో యూపీ వారియర్స్ రెండో విజయం నమోదు చేసుకుంది. శుక్రవారం జరిగిన పోరులో యూపీ 6 వికెట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌ను చిత్తుచేసింది. మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 142 పరుగులు చేసింది. లిచ్‌ఫీల్డ్ (35), ఆష్లే గార్డ్‌నర్ (30), వాల్వర్డ్ (28) తలా కొన్ని పరుగులు చేశారు. యూపీ బౌలర్లలో సోఫియా 3 వికెట్లు పడగొట్టింది. అనంతరం లక్ష్యఛేదనలో 15.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 143 పరుగులు చేసింది. కెప్టెన్ అలీసా హీలీ (33; 7 ఫోర్లు) ఆరంభంలో వరుస బౌండ్రీలతో బెంబేలెత్తించగా.. డబ్ల్యూపీఎల్‌లో అరంగేట్రం చేసిన చమరి ఆటపట్టు (17; 4 ఫోర్లు) పర్వాలేదనిపించింది. ఆఖర్లో గ్రేస్ విజృంభించడంతో యూపీ సునాయాసంగా గెలుపొందింది. నాలుగు మ్యాచ్‌లు ఆడిన యూపీకి ఇది రెండో విజయం కాగా.. గుజరాత్ మూడు మ్యాచ్‌లు ఆడి బోణీ కొట్టలేకపోయింది. హ్యారిస్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

ఆధిక్యంలో ఆసీస్

న్యూజిలాండ్‌తో తొలి టెస్టు

వెల్లింగ్టన్: బౌలర్లు సమిష్టిగా విజృంభించడంతో న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఆస్ట్రేలియా భారీ ఆధిక్యం మూటగట్టుకుంది. కామెరూన్ గ్రీన్ (174 నాటౌట్; 23 ఫోర్లు, 5 సిక్సర్లు) భారీ సెంచరీ బాదడంతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 383 పరుగులకు ఆలౌటైంది. కివీస్ బౌలర్లలో హెన్రీ 5 వికెట్లు పడగొట్టాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన న్యూజిలాండ్ 179 పరుగులకే ఆలౌటైంది. ఫిలిప్స్ (71), హెన్రీ (42) కాస్త పోరాడగా.. విలియమ్సన్ (0), రచిన్ (0), లాథమ్ (5), యాంగ్ (9), మిషెల్ (11) విఫలమయ్యారు. ఆసీస్ బౌలర్లలో లియాన్ 4 వికెట్లు తీశాడు. అనంతరం

రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కంగారూలు శుక్రవారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి 13/2తో నిలిచారు. చేతిలో 8 వికెట్లు ఉన్న ఆసీస్ ప్రత్యర్థి కంటే 217 పరుగుల ఆధిక్యంలో ఉంది.

ఐర్లాండ్ చారిత్రక విజయం

అఫ్గాన్‌పై టెస్టు విక్టరీ

అబుదాబి: టెస్టు హోదా సాధించిన ఏడేండ్ల తర్వాత ఐర్లాండ్ తొలి టెస్టు విజయం నమోదు చేసుకుంది. అఫ్గానిస్థాన్‌తో మూడు రోజుల్లో ముగిసిన ఏకైక టెస్టులో ఐర్లాండ్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. అఫ్గాన్ తొలి ఇన్నింగ్స్‌లో 155 పరుగులు చేయగా.. ఐర్లాండ్ 263 రన్స్ కొట్టింది. రెండో ఇన్నింగ్స్‌లో మెరుగైన ప్రదర్శన చేసిన అఫ్గాన్ 218 పరుగులు చేయగా.. ఐర్లాండ్ 111 పరుగుల లక్ష్యాన్ని 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 8 వికెట్లు తీసిన మార్క్ ఆడైర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

సెమీస్‌లో అంకిత

గురుగ్రామ్: భారత స్టార్ టెన్నిస్ ప్లేయర్ అంకిత రైనా ఐటీఎఫ్ మహిళల టోర్నీ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో అంకిత 4-6, 6-2, 6-4తో జాక్వెలిన్ కాబాజ్ (స్వీడన్)పై విజయం సాధించింది. రెండో సీడ్‌గా బరిలోకి దిగిన అంకిత.. తొలి సెట్ కోల్పోయినా.. తిరిగి పుంజుకొని వరుస సెట్లలో గెలుపొందింది. మరో క్వార్టర్‌ఫైనల్లో తెలంగాణ అమ్మాయి యమలపల్లి సహజ 5-7, 6-3, 0-6తో టాప్ సీడ్ డాలియా (స్లొవేనియా) చేతిలో పోరాడి ఓడింది.

లక్నో అసిస్టెంట్ కోచ్‌గా క్లూసెనర్

లక్నో: దక్షిణాఫ్రికా మాజీ ఆల్‌రౌండర్ లాన్స్ క్లూసెనర్.. ఐపీఎల్ ఫ్రాంచైజీ లక్నో సూపర్ జెయింట్స్ అసిస్టెంట్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. రెండేండ్ల క్రితం ఐపీఎల్లో అడుగుపెట్టిన లక్నో జట్టు.. గత రెండు సీజన్లలోనూ ప్లే ఆఫ్స్‌కు చేరగా.. ఈసారి చాంపియన్‌గా నిలువాలనే లక్ష్యంతో పకడ్బందీ చర్యలు చేపడుతున్నది.

అనుష్క హ్యాట్రిక్

ఖాట్మాండు: యువ స్ట్రయికర్ అనుష్క కుమారి హ్యాట్రిక్ గోల్స్‌తో చెలరేగడంతో.. దక్షిణాసియా అండర్-16 బాలికల చాంపియన్‌షిప్‌లో భారత్ ఘనవిజయం సాధించింది. శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో భారత్ 7-0తో భూటాన్‌పై గెలుపొందింది. 13 ఏండ్ల అనుష్క మ్యాచ్ ఆరంభం నుంచి మైదానమంతా పాదరసంలా కదులుతూ ఆకట్టుకుంది.

చాంపియన్ పల్టన్

ఫైనల్లో హర్యానా స్టీలర్స్‌పై జయభేరి • ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్

గత రెండు పర్యాయాలు తుది మెట్టుపై బోల్తా కొట్టిన పుణెరి పల్టన్ ఈసారి ఆ అడ్డంకిని అధిగమించి చాంపియన్‌గా అవతరించింది. శుక్రవారం హైదరాబాద్ వేదికగా జరిగిన హోరోహోరీ ఫైనల్లో హర్యానా స్టీలర్స్‌పై పల్టన్ విజయం సాధించింది. రైడింగ్‌లో ఇరు జట్లు సమంగా నిలిచినా.. ట్యాక్లింగ్‌లో సత్తాచాటిన పల్టన్ చాంపియన్‌గా అవతరించింది.

హైదరాబాద్, ఆట ప్రతినిధి: మూడు నెలలుగా అభిమానులను ఉర్రూతలూగించిన ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) సీజన్-10కు ఘన ముగింపు లభించింది. లీగ్‌లో కొత్త చాంపియన్ అవతరించింది. ఉత్కంఠ భరితంగా సాగిన టైటిల్ పోరులో హర్యానా స్టీలర్స్‌ను చిత్తు చేసిన పుణెరి పల్టన్ జట్టు టైటిల్ కైవసం చేసుకుంది. శుక్రవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలీ స్టేడియంలో జరిగిన తుదిపోరులో పల్టన్ 2825తో హర్యానా స్టీలర్స్‌పై విజయకేతనం ఎగరవేసింది. పల్టన్ తరపున పంకజ్ మోహిత్ 9 రైడ్ పాయింట్లతో చెలరేగగా.. మోహిత్ గోయత్ (5 పాయింట్లు), అస్లమ్ ఇమాన్‌దార్ (4 పాయింట్లు), డిఫెండర్ గౌరవ్ ఖత్రి (4 పాయింట్లు) రాణించారు. మరోవైపు హర్యానా స్టీలర్స్ తరపున శివ (6), సిద్ధార్థ్ దేశాయ్ (4), వినయ్ (3) పోరాడినా ఫలితం లేకపోయింది. తుది పోరులో ఇరు జట్లు రైడింగ్‌లో సమంగా నిలిచినా.. డిఫెన్స్‌లో బలంగా ఉన్న పల్టన్ టైటిల్ ఎగరేసుకుపోయింది. ఇరు జట్లు రైడింగ్‌లో చెరో 17 పాయింట్లు సాధించగా.. డిఫెన్స్‌లో పల్టన్ 9 పాయింట్లు సహా ఓ ఆలౌట్ బోనస్ దక్కించుకుంది. హర్యానా 5 ట్యాకిల్స్‌కే పరిమితమై టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచింది.

ఉత్కంఠభరితంగా..

ప్రొ కబడ్డీ లీగ్‌లో వరుసగా రెండో ఏడాది ఫైనల్‌కు చేరుకున్న పల్టన్ తమ టైటిల్ కల నెరవేర్చుకుంది. గ్రూప్ దశలో తిరుగులేని ఆధిక్యం కనబర్చిన పల్టన్.. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలువగా.. హర్యానా కూడా నిలకడైన విజయాలతో ముందుకు సాగింది. డిఫెన్స్‌లో అత్యంత పటిష్టమైన జట్లుగా పేరు తెచ్చుకున్న పల్టన్, స్టీలర్స్ మధ్య పోరు రసవత్తరంగా సాగింది. ఇరు జట్ల ఆటగాళ్లు ఆచితూచి ఆడటంతో.. డై ఆర్ డై రైడ్‌లో తప్ప మిగతా రైడ్స్‌లో ఎక్కువ పాయింట్లు రాలేదు. బలమైన డిఫెన్స్ కనబర్చడంతో తొలి అర్ధభాగంలో ఒక దశలో స్కోర్లు 7-7తో సమం కాగా.. పల్టన్ రైడర్ పంకజ్ మ్యాచ్‌ను మలుపుతిప్పాడు. చావోరేవో రైడ్‌లో పంకజ్ నాలు పాయింట్లు సాధించి జట్టుకు ఆధిక్యం అందించాడు. దీంతో ప్రథమార్థం ముగిసేసరికి పల్టన్ 13-10తో ముందంజలో నిలిచింది. సెకండ్ హాఫ్‌లో హర్యానా స్టీలర్స్ పుంజుకునే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయపోయింది. ఒక దశలో 18-11తో సంపూర్ణ ఆధిపత్యం కనబర్చిన పల్టన్ ఆ తర్వాత ప్రత్యర్థికి కొన్ని పాయింట్లు సాధించే చాన్స్ ఇచ్చినా.. చివర్లో తేరుకొని గెలుపొందింది. ద్వితీయార్థంలో హర్యానా, పల్టన్ చెరో 15 పాయింట్లు సాధించినా.. ఫస్ట్‌హాఫ్‌లో పుణె సాధించిన మూడు పాయింట్ల ఆధిక్యం.. ఆ జట్టును విజేతగా నిలువడం కీలక పాత్ర పోషించింది.

ముంబై X తమిళనాడు

- నేటి నుంచి రంజీ ట్రోఫీ సెమీఫైనల్
- మరో పోరులో విదర్భతో మధ్యప్రదేశ్ ఢీ

ముంబై: దేశవాళీ ప్రతిష్ఠాత్మక టోర్నీ రంజీ ట్రోఫీ చివరి అంకానికి చేరింది. సీజన్ ఆసాంతం నిలకడగా రాణించిన నాలుగు జట్లు నేటి నుంచి ప్రారంభం కానున్న సెమీఫైనల్స్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. నాగ్‌పూర్ వేదికగా జరగనున్న తొలి సెమీస్‌లో విదర్భతో మధ్యప్రదేశ్ అమీతుమీ తేల్చుకోనుండగా.. ముంబై వేదికగా జరగనున్న రెండో సెమీస్‌లో తమిళనాడుతో ముంబై పోటీ పడుతున్నది. జాతీయ జట్టులో చోటు దక్కించుకోవాలంటే.. రంజీ ట్రోఫీ ఆడటం తప్పనిసరి అని బీసీసీఐ హుకుం జారీ చేయగా.. శ్రేయస్ అయ్యర్ ఈ మ్యాచ్ బరిలోకి దిగుతున్నాడు. మరోవైపు ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు ఎంపికైన స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ కూడా టీమ్ నుంచి రిలీవ్ అయి.. రంజీ సెమీస్‌లో తమిళనాడుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఇప్పటికే 41 సార్లు రంజీ చాంపియన్‌గా నిలిచిన ముంబై స్టార్‌లతో దిట్టంగా ఉండగా.. తమిళనాడు వరుస విజయాలతో జోరు మీద ఉంది. ముంబై జట్టుకు సీనియర్ బ్యాటర్ అజింక్యా రహానే సారథ్యం వహిస్తుండగా.. సాయి కిషోర్ కెప్టెన్సీలో తమిళనాడు బరిలోకి దిగనుంది. శ్రేయస్ అందుబాటులోకి రావడంతో జట్టు బలం మరింత పెరిగిందని రహానే పేర్కొన్నాడు. 'అతడు అనుభవజ్ఞుడు. ముంబైకి అతడి సేవలు అమూల్యం. అతడు డ్రెస్సింగ్ రూమ్‌లో ఉండటం ఇతర ఆటగాళ్లకు కూడా ఉపయోగ పడనుంది' అని రహానే చెప్పుకొచ్చాడు.

మిర్చి బస్తాలతో నిండిపోయిన ఖమ్మంలోని వ్యవసాయ మార్కెట్

మిర్చి రైతుల కన్నెర్ర

కడుపు మండి.. రోడ్డెక్కి

గిట్టుబాటు ధర కోసం ఖమ్మం మార్కెట్ ఎదుట ఆందోళన

సర్కారు ఆరా.. అధికారుల తీరుపై మంత్రి తుమ్మల అసహనం

ఖమ్మం వ్యవసాయం, మార్చి 1: మిర్చి పంటకు కనీస మద్దతు ధర లభించడం లేదని శుక్రవారం రైతులు కన్నెర్ర చేశారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నాకు దిగారు. ఈ వ్యవహారంపై సర్కారు ఆరా తీసింది. మార్కెటింగ్ అధికారుల తీరుపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలని ఆదేశించారు. వివరాలు ఇలా.. ఖమ్మం ఏఎంసీకి జిల్లా నుంచే కాక భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల నుంచి మిర్చి తరలివస్తున్నది. రోజుకు కనీసం 60 వేల బస్తాలకు తగ్గడం లేదు. వ్యాపారులు రోజూ ఉదయం నిర్వహించే జెండాపాటలో ధర తగ్గిస్తుండటం, జెండాపాటలో ఖరీదుదారుల మధ్య పోటీ లేకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం జెండాపాటలో మిర్చి క్వింటాల్ గరిష్ఠ ధర రూ.20,800 పలికింది. జెండాపాటకు ఒకరిద్దరు ఖరీదుదారులు మాత్రమే రావడం, మరోవైపు కొందరు వ్యాపారుల గుమస్తాలు పంటకు ఏదో ఒక ధరకు కొనుగోలు చేస్తుండటంతో రైతులు మండిపడుతూ మార్కెట్ ఎదుట ఆందోళనకు దిగారు. ఒక దశలో మార్కెట్ యార్డు గేట్లను మూసి వేసే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న మార్కెట్ కమిటీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, మార్కెటింగ్‌శాఖ అధికారి ఎంఏ అలీం, ఉద్యాన అధికారి రమణ, ట్రీటాన్ సీఐ రమేశ్ రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ వచ్చి రైతులతో మాట్లాడారు. పంట నాణ్యతను బట్టే క్రయ విక్రయాలు జరుగుతాయని, జెండా పాటకు ఖరీదుదారులంతా వస్తారని చెప్పడంతో రైతులు శాంతించారు.

మంత్రి తుమ్మల ఫైర్

హైదరాబాద్: ఖమ్మం మార్కెట్‌లో మిర్చి రైతుల ఆందోళనపై మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరా తీశారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో మార్కెటింగ్ డైరెక్టర్‌తో సమీక్ష నిర్వహించారు. రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలని ఆదేశించారు.

వేడెక్కుతున్న భానుడు!

- పలు జిల్లాల్లో 40 డిగ్రీలకు చేరువలో..
- ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో అధిక ఉష్ణోగ్రతలు..!

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో రోజురోజుకీ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో 40 డిగ్రీలకు చేరగా, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో 38 డిగ్రీలు దాటింది. రానున్న రోజుల్లో ఎండలు మరింత పెరగొచ్చని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ వాతావరణశాఖ అధికారులు సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలున్నాయని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తర కర్ణాటకతో పాటు మహారాష్ట్ర, ఒడిశాలోని అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ రోజులు వేడిగాలులు వీస్తాయని తెలిపింది. మార్చి, మే నెలల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని భారత వాతావరణశాఖ డైరెక్టర్ మృత్యుంజయ మహాపాత్ర తెలిపారు. మార్చిలో ఉత్తర, మధ్య భారత్‌లో మాత్రం వడగాలుల తీవ్రత ఉండకపోవచ్చని తెలిపారు. ప్రస్తుత ఎల్‌నినో ప్రభావం వేసవి వరకూ ఉండొచ్చని, ఆ తర్వాత పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకుంటాయని పేర్కొన్నారు. మరోవైపు దేశంలో అనుకూల వర్షపాతానికి కారణమైన లానినా పరిస్థితులు మాత్రం వర్షాకాలం మధ్య నుంచి ఏర్పడతాయని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం వివిధ ప్రాంతాల్లో నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు..

జిల్లా	ఉష్ణోగ్రతలు
ఆదిలాబాద్	38.3
భద్రాచలం-కొత్తగూడెం	38
హనుమకొండ	35
హైదరాబాద్	34.9
ఖమ్మం	36.6
మహబూబ్‌నగర్	37.4
మెదక్	35.8
నల్లగొండ	35.5
నిజామాబాద్	38.2
రామగుండం	36.6

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.